క్లుప్తంగా

ఘనంగా మాస శివరాత్రి అభిషేకాలు



కొంకుదురులో ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని బుడతల మామిడి వద్ద గల శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం అభిషేకం నిర్వహించారు. అర్చకులు రమణశర్మ, భాస్కరశర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్‌తో స్వామివారిని అభిషేకించారు. అమ్మవారికి కుంకుమ అర్చన చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని సరిపల్లిపేటలో ఉన్న అవతార్ మెహర్‌బాబా ఆలయ నాలుగో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక భజనలు, పూజలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

కల్యాణ మంటపం ప్రారంభం

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం సమీపంలో నిర్మించిన మండల ఆర్యవైశ్య సంఘం కల్యాణ మంటపాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆ సంఘం నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం మండలాధ్యక్షుడు బొండాడ చందు, నాయకుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

కుమార సుబ్రహ్మణేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణేశ్వరస్వామి

బిక్కవోలు: స్థానిక శ్రీ కుమార సుబ్రహ్మణేశ్వరస్వామికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. కార్తికమాసం చివరి మంగళవారం కావడంతో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

సారా, మద్యం ధ్వంసం

రంగంపేట: స్థానిక సెబ్ స్టేషన్ అధికారులు మండలంలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సారా, అక్రమ మద్యంను మంగళవారం ధ్వంసం చేశారు. అనంతరం సెబ్ సీఐ జి.వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 14 కేసుల్లో పట్టుబడిన 155.5 లీటర్ల సారా, నాలుగు కేసుల్లో పట్టుబడిన 31 అక్రమ మద్యం బాటిళ్లలోని మద్యాన్ని, 10.4 లీటర్ల బీరు, 849 కేజీల నల్లబెల్లాన్ని స్థానిక సెబ్ స్టేషన్ వద్ద ధ్వంసం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

18 నుంచి షష్ఠి ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున కొలువైన వల్లీ దేవసేనా సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని 97వ షష్ఠి మహోత్సవాలు ఈ నెల 18 నుంచి 22 వరకూ జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో కంకటాల సత్తిపండు, సముద్రాల రాంబాబు, దవులూరి శ్రీను, బి.ప్రసాద్, కంకటాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

357 మందికి వైద్యసేవలు



వంగలపూడిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: వంగలపూడిలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ రాజు వైద్యసేవలు అందించారు. సుమారు 357 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రశేఖర్, ఏఎన్ఎం స్వప్న, ఆశా వర్కర్లు ఐ.లక్ష్మి, టి.జ్యోతి, ఎ.లక్ష్మి, పార్టీ నాయకులు కొంచ భాస్కరరావు, పేరిచర్ల శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆడుదాం...అందరం

- డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడలు
- గ్రామ సచివాలయాల పరిధిలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు



ఖోఖో ఆడుతున్న బాలురు (ఫైల్)

అనపర్తి: క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగివున్న ప్రతిభను గుర్తించడానికి ఆడుదాం ఆంధ్రా పేరుతో ఈ నెల 15వ తేదీ నుంచి క్రీడా సంబరాల నిర్వహణకు సిద్ధమైంది. క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా గత నెల 27న ప్రారంభమైన క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 13తో ముగియనుంది. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ మొత్తం ఐదు క్రీడాంశాల్లో పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

15 ఏళ్లు పైబడిన వారందరికీ అవకాశం..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం...ఆంధ్ర క్రీడాపోటీల్లో 15 ఏళ్లు పైబడిన బాల బాలికలు, మహిళలు, పురుషులు పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. గ్రామ సచివాలయం, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ క్రీడాపోటీలకు సంబంధించి ఇప్పటికే క్రీడా సామగ్రిని ఆయా సచివాలయాలకు పంపిణీ చేశారు. సచివాలయాల పరిధిలో నిర్వహించే పోటీలకు బేసిక్, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీలకు ప్రొఫెషనల్ క్రికెట్ కిట్‌తోపాటు ఇతర క్రీడా సామగ్రిని ప్రభుత్వం అందజేసింది. ఇదిలావుండగా మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు టీషర్ట్స్, క్యాప్స్, బ్యాండ్ అందజేస్తారు. దీనితోపాటు నియోజకవర్గ స్థాయి, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు నగదు బహుమతి, మెడల్స్‌తోపాటు ట్రోఫీ అందజేయనున్నారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధించి సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోనున్నారు.

79 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు

నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో గల మొత్తం 79 సచివాలయాల పరిధిలో ఆడుదాం...ఆంధ్రా క్రీడా పోటీలు జరగనున్నాయి. సచివాలయాల పరిధిలో క్రీడల నిర్వహణకు రెండు వందలకు పైగా క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొనే విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలు చేపట్టారు. ఐదు రోజులపాటు సచివాలయాల స్థాయిలో, 12 రోజులు మండల స్థాయిలో, ఐదు రోజులు నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల వివరాల సేకరణ, ఆన్‌లైన్‌లో నమోదుకు ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్లు శ్రమించారు.

ప్రత్యేక కమిటీలు

గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలో నిర్వహించే పోటీలు పగడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టిన అధికారులు దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడా పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను నియమించారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, ఎస్సై, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, మండల వ్యవసాయాధికారి, వైద్య ఆరోగ్యశాఖ, వివిధ శాఖల అధికారులు, పాఠశాల హెచ్ఎంలు కమిటీ సభ్యులుగా ఉంటారు.

> **ప్రణాళికాబద్ధంగా పోటీలు...**
>
> 
>
> నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఆడుదాం.... ఆంధ్రా క్రీడాపోటీలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రతీ సచివాలయ పరిధిలో 228 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నాం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీలో యువత మరింత ఉత్సాహంగా పాల్గొనాలి.
>
> – పడాల శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్, అనపర్తి

తుపాను బాధితులకు సాయం



బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయంలో సాయం అందిస్తున్న నాయకులు

బిక్కవోలు: ఇటీవల కురిసిన మిచాంగ్ తుపాను వలన రెండు తాటాకు పాకలు కూలిపోవడంతో తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన కె.చిట్టెమ్మ రంగాపురం గ్రామానికి చెందిన దర్శిపాటి సర్సయ్య పాకలు కూలిపోవడంతో ప్రభుత్వం నుంచి రూ.10వేల సాయం అందించారు. కాపవరం సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

నేడు బాబా ఆలయంలో పూర్ణాహుతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో బుధవారం పూర్ణాహుతి హోమం నిర్వహించనున్నారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొలుత బాబాకు క్షీరాభిషేకం చేస్తారు. కార్తిక మాసంలో ఓంశ్రీసాయిరామ్ నామ జప యజ్ఞం నిర్వహించారు. కార్తిక మాసం ముగియనుండటంతో పూర్ణాహుతి నిర్వహించనున్నారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుంది.

వైభవంగా లక్ష దీపోత్సవం

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె వీరన్నబాబు (బాబీ), మండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళా భక్త సమాజం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. రామచంద్రపురం గణపతి ఆలయం నుంచి ఏటిగట్టుపై గల ఆంజనేయస్వామి ఆలయం వరకూ దీపాలు వెలిగించారు.

అభివృద్ధి జరగాలంటే జగనన్నే సీఎం కావాలి



బలభద్రపురంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన అప్పాజీ తదితరులు

బిక్కవోలు: ప్రజల కోసం అహర్నిశలూ కష్టపడే మన జగనన్నకు అందరం కలిసి మద్దతుగా నిలబడదామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. మంగళవారం బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురువేశారు. అప్పాజీ మాట్లాడుతూ ప్రజలు అడగకుండానే వారికి కావాల్సిన అవసరాలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలన్నారు. సర్పంచ్ బుంగా రామారావు, వైఎస్సార్ సీపీ జేఏసీ కన్వీనర్ బొడ్డు ముత్యలరావు, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, బొడ్డు శ్రీను, ఈవోపీఆర్డీ భవాని, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సచివాలయం మహిళ సంరక్ష కార్యదర్శి కొటాని శాంతి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..



రఘుదేవపురంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. రఘుదేవపురంలో మంగళవారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రతి ఇంటికి వెళ్లి, వారికి ప్రభుత్వ అందజేసిన పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

పారదర్శకంగా పథకాలు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు జగన్ అన్నారు. 2014 నుంచి 19 వరకూ టీడీపీ ప్రభుత్వ హయాంలో రఘుదేవపురం రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.20.43 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. అందులో మండల ప్రజల అవసరాల కోసం రూ.8 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చేపట్టామన్నారు. 9,351 మందికి సంక్షేమ పథకాల రూపంలో రూ.23.79 కోట్లు అందించామన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఉప సర్పంచ్ పట్టపగల విష్ణుప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, దాసరి బాబీ, పిండి రాధాకృష్ణ, నిడదవోలు శ్రీనివాస్, వట్టికూటి పుల్లారావు, పంతుల శ్రీను, సుంకర సూర్యచంద్రం, కాండ్ర వెంకట్రాజు, లుగలాపుల మల్లేశ్వరరావు, చుండ్రు శ్రీనివాసరావు, చిట్టూరి శ్రీనివాస్, గెడ్డం రాజు, బండి రవి, పిసిని రాజు పాల్గొన్నారు.

రైతులకు తక్షణమే పరిహారం అందించాలి

సీతానగరం: మిచాంగ్ తుపాను కారణంగా పంటలను నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు కోరారు. ఆయన సోమవారం సీతానగరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి వరికి రూ.20 వేలు, మొక్కజొన్న, పొగాకుకు రూ.10 వేలు, అరటికి రూ.30 వేలు, కూరగాయలు, మినుములు, పెసలు వంటి పంటలకు రూ.15 వేలు అందించాలన్నారు.

నేడు చంద్రేడులో వై ఏపీ నీడ్స్ జగన్

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవిలతో పాటు మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్క లబ్ధిదారునికి వారి ఇంటి ముంగిటికే అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మార్కండేయపురం, షారోన్‌పురం, ఆంజనేయ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం మూడో రోజు ఎమ్మెల్యే గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సూర్యనారాయణరెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన దేశానికే ఆదర్శమని, పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తూ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ప్రజలకు అందించారు. సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ సభ్యులు బండారు శ్రీనివాసరావు, సత్తి దొరయ్యరెడ్డి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ నాయకులు మిలట్రీరెడ్డి, పాదూరి డేవిడ్‌రాజు, పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

18లోగా పంటనష్టంపై అంచనాలివ్వాలి



నందరాడలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజానగరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వీచిన గాలులకు జిల్లాలో జరిగిన పంట నష్టంపై ఈనెల 18 లోగా అంచనాలివ్వాలని సిబ్బందికి ఆదేశించామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు. వీటిని అనుసరించి తుది నివేదిక తయారు చేసి ఈనెల 24 నాటికి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. నందరాడలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేయడం కోసం ఇప్పటికే గ్రామ, మండల, డివిజన్‌ల స్థాయిలో కమిటీలను వేశామన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 33 శాతం పైబడి జరిగిన పంట నష్టాన్నే పరిగణనలోకి తీసుకుని నివేదికలు తయారు చేస్తారన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామ్ కాసిమ్, ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.


ఆరోగ్యమిత్రకు ఉత్తమ సేవా పురస్కారం



కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న కాశీవిశ్వనాథ్

గోకవరం: గోకవరం ప్రభుత్వాస్పత్రి ఆరోగ్యమిత్ర దాసరి కాశీవిశ్వనాథ్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఆగస్టులో ఆయన అందించిన సేవలకు మంగళవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ఆయనకు ఈ అవార్డు, నగదు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా కాశీవిశ్వనాథ్‌ను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, వైద్య సిబ్బంది అభినందించారు.

అవగాహన పెంచుకోవాలి



మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామ పంచాయతీరాజ్‌శాఖ విధి విధానాలపై సచివాలయం కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రేడ్–1 నుంచి 6 వరకు గల సచివాలయం కార్యదర్శులకు పంచాయతీరాజ్‌శాఖపై శిక్షణ, అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ఏ విధంగా ఆదాయం సమీకరించుకోవాలో వివరించారు. పంచాయతీశాఖలో ఏ విధులు చేపట్టాలి, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టవచ్చో పేర్కొన్నారు. కార్యదర్శులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, అచ్చిరాజు, త్రినాథ్ పాల్గొన్నారు.

అందుకే మళ్లీ జగన్ కావాలి



రాజుపాలెంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదపూడి: సీఎం జగన్ అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అమలు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపినందుకు రాష్టానికి మళ్లీ సీఎంగా జగనే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పలువురు వక్తలు అన్నారు. రాజుపాలెం గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఏ పథకాలతో ఎంతమంది లబ్ధి పొందారో వివరాలు తెలియజేసే సంక్షేమ అభివృద్ధి పథకాల బోర్డును సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించి, అవగాహన సభ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ సీఎం జగన్ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. వలంటీరు ఇంటింటికి తిరిగి ఏ కుటుంబానికి ఏ పథకాలు అందాయి? ఇంకా ఏమైనా పథకాలకు వారు అర్హులా కాదా అనే వివరాలు సేకరించారు. సర్పంచ్ గుత్తుల పుష్పవతి, ఉప సర్పంచ్ నాగుమళ్ల వీరభద్రరావు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, సచివాలయం కార్యదర్శి ఎస్‌వీ స్వామి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహనకే వికసిత్ భారత్



దోమాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు


పెదపూడి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ వీవీ సాయి బాబు అన్నారు. కరకుదురు, దోమాడ గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలను శాఖల వారీగా వివరించారు. సర్పంచులు వుండ్రు చంద్రకళ, మీనవల్లి శారదాదేవి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్, కో కన్వీనర్ శివరామకృష్ణంరాజు, మురముళ్ల వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఎంసత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం



దివాన్‌చెరువులో ఈవీఎం మెషీన్ నమూనా స్క్రీన్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ మాధవీలత

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుహక్కు వజ్రాయుధమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో మంగళవారం రాత్రి ఈవీఎం మిషన్ నమూనాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు పొందిన వారు ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. ఓటరుగా నీవు ఉంటే.. దేశం నీవెంటే అనే నినాదంతో స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా నమూనా ఈవీఎం పరికరాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటు వేసే విధానంపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ చైత్రవర్షిణి, డీటీ సునీత పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సరస్వతి, డీటీ శశిధర్

ఈవీఎంల వినియోగంపై అవగాహన

అనపర్తి: ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు గాను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)ల వినియోగంపై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ వై.సరస్వతి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లో ఉండే కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ల పనితీరు, ఏ విధంగా ఓటు వెయ్యాలి, తదితర అంశాలపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కల్పించారు. డీటీ టి.శశిధర్, వివిధ రాజకీయపార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో శైవక్షేత్రాలు కిటకిట



చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: కార్తిక మాసం చివరిరోజు అయిన మంగళవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచి శివాలయాల్లో శివనామ స్మరణలు మొదలయ్యాయి. అభిషేకాలు, పూజలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. రంగంపేటలోని శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయంలో, చంద్రేడు లోని శ్రీ కాత్యాయనీ సమేత చంద్రశేఖర ఆలయంలో ఆలయ అర్చకులు నాగేంద్ర, కృష్ణలు రుద్రహోమం నిర్వహించారు. సింగంపల్లి, జి.దొంతమూరు, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం, వీరంపాలెం, వడిశలేరు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు మహిళలు అధిక సంఖ్యలో శివాలయాలకు చేరుకుని దీపాలను వెలిగించారు. దీపాలంకరణలో దేవాలయాలు బంగారు వర్ణంతో మెరిసిపోయాయి. వివిధ ఆకతులలో దీపాలను వెలిగించడంతో ఆలయ ప్రాంగణాలు కనువిందు చేయగా భక్తులు పరవశించిపోయారు. దీపాలను చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ముంపు పంటల పరిశీలన

సీతానగరం: మిచాంగ్ తుపాను కారణంగా కూనవరంలో ముంపునకు గురైన పంటపొలాలను నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి మాజీ మంత్రి జవహర్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ముగ్గళ్లలో విలేకరులతో మాట్లాడారు. తక్షణమే ఏ పంటకైన ఎకరానికి రూ.30 వేలు పరిహారంగా అందించాలన్నారు.